క్లుప్తంగా

వాగు దాటేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి



వాలీబాల్ కిట్ అందజేస్తున్న ఎస్సై మధుకర్

కెరమెరి: వాగులు దాటేటప్పుడు ప్రజలు జాగ్రత్తలు పాటించాలని ఎస్సై మధుకర్ అన్నారు. శనివారం మండలంలోని పెద్దవాగు అవతల ఉన్న లక్మాపూర్ గ్రామాన్ని సందర్శించారు. గ్రామస్తులతో మాట్లాడారు. భారీ వర్షాలు కురిసి వాగులు, వరదలు పొంగిపొర్లుతున్నప్పుడు వాగులు దాటి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిస కావొద్దని సూచించారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా యువకులకు వాలీబాల్ కిట్ అందజేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కు అందజేస్తున్న బీజేపీ నాయకులు

పెంచికల్‌పేట్: మండలంలోని అగర్‌గూడ గ్రామానికి చెందిన కామెర బాబాజీ రూ. 60 వేలు, ఎల్కపల్లి గ్రామానికి చెందిన రాచకొండ మమత రూ.42 వేలు, జునుగరి సుగుణకు రూ.7500ల సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు కాగా బీజేపీ మండల అధ్యక్షుడు కుకిడే రాజేశ్వర్ శనివారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జునుగరి మధుకర్, చప్పిడే సత్యనారాయణ. నగేశ్, ప్రభాకర్, రాజన్న, బాపూజీ, సంతోష్, కిషన్, కమలాకర్, భాస్కర్, మహేశ్, రాజన్న, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ విద్యుత్ ఉప కేంద్రంలో నెలవారి మరమ్మతులో భాగంగా ఆదివారం పట్టణంలోని పలు కాలనీల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ లక్ష్మిరాజం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతులో భాగంగా పట్టణంలోని బ్రాహ్మణవాడ, రావులవాడ, కంచుకోట, ఓల్డ్‌పోస్ట్ ఆఫీస్, సందీప్‌నగర్, నూర్ నగర్, జన్కాపూర్ కోదండ రామాలయం, కేబీచౌక్, ఉస్మానియా మజీద్, దస్నాపూర్, హడ్కో కాలనీ, రహ్మత్‌నగర్, జుబ్లీ మార్కెట్, ఎన్జీవో కాలనీ, ఓల్డ్ రాజంపేట, న్యూ రాజంపేట, గుండి రోడ్, టీఆర్‌నగర్, ఎక్స్‌ప్రెస్ జిన్నింగ్ మిల్లు, కలెక్టరేట్ రోడ్, బజార్‌వాడీ, వివేకానంద చౌక్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, విద్యుత్ వినియోగదారులు అంతరాయానికి సహకరించాలని కోరారు.

బాలికలకు పౌష్టికాహారం అందించాలి



పౌష్టికాహారం అందజేస్తున్న పవన్‌కళ్యాణ్ రెడ్డి

కౌటాల: అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోర బాలికలకు పౌష్టికాహారం అందించాలని మండల వైద్యాధికారి పవన్‌కళ్యాణ్ రెడ్డి అన్నారు. అమ్మ మాట -అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంలోని సదాశివపేట అంగన్‌వాడీ కేంద్రంలో బాలికలకు పల్లిపట్టీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌష్టికాహారంతోనే ఆరోగ్యంగా ఉంటామని, అందరూ చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవాలని సూచించారు. వర్షాకాలంలో వ్యాధులు సోకే అవకాశం ఉంటుందని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహార సరుకులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏఎస్ఎం రజిని, అంగన్‌వాడీ టీచర్ జీజాబాయి పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు అమర్చిన ఇద్దరు రిమాండ్

తిర్యాణి: అడవి జంతువులను వేటాడటం కోసం విద్యుత్ తీగలు అమర్చిన ఘటనలో ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రోంపెల్లి గ్రామానికి చెందిన నైతం సాగర్, టేకం భీంరావు అనే ఇద్దరు వ్యక్తులు కొన్ని రోజుల క్రితం గిన్నెబండ అటవీ ప్రాంతంలో అడవి జంతువుల కోసం కరెంట్ తీగలు అమర్చగా చెలిమల గ్రామానికి చెందిన కుర్సింగ గంగోలి, ఆత్రం జగ్గారావుకు చెందిన రెండు గేదెలు వాటికి తగిలి మృత్యువాత చెందాయని తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను అదుపులోకి తీసుకుని శనివారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

గ్రంథాలయానికి పక్కా భవనం కరువు

- కనీస సౌకర్యాలు లేవు
- పాఠకులు, నిరుద్యోగుల తిప్పలు

హామీ ఇచ్చినా మార్పు రాలేదు



ఇటీవల కౌటాల గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర చైర్మన్ రియాజ్, ఎమ్మెల్యే హరీశ్‌బాబు

మే 6న కౌటాల గ్రంథాలయ భవనాన్ని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబుతో కలిసి గ్రంథాలయ రాష్ట్ర చైర్మన్ డా.రియాజ్ పరిశీలించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కుమురం భీం జిల్లాలోని గ్రంథాలయాల పరిస్థితులు అధ్వానంగా ఉన్నాయని, మెరుగైన వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కౌటాల గ్రంథాలయానికి నూతన భవనం నిర్మిస్తామని, లేకపోతే ఖాళీగా ఉన్న ఇతర ప్రభుత్వ భవనంలోకి గ్రంథాలయాన్ని తాత్కాలికంగా మారుస్తామన్నారు. నెల రోజులైనా పరిస్థితుల్లో ఎలాంటి మార్పు రాకపోవడంతో పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు.



గ్రామ పంచాయతీ భవనంలో కొనసాగుతున్న గ్రంథాలయం

కౌటాల: మండల కేంద్రంలో గ్రంథాలయానికి పక్కా భవనం లేక గ్రామ పంచాయతీ భవనంలో ఏళ్లుగా కొనసాగుతోంది. అక్కడా సౌకర్యాలు కరువయ్యాయి. సరిపడా కుర్చీలు లేవు. ఎక్కువ మంది పాఠకులు వస్తే నిలబడాల్సిన పరిస్థితి ఉంది. కేవలం చిన్నపాటి ఒక్క గదిలో పుస్తకాలు, వార్తాపత్రికలను పాఠకులు చదువుకోవాల్సి వస్తోంది. కావాలిసిన పుస్తకాలు సమకూర్చకపోవడంతో నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉన్న రెండు, మూడు కుర్చీలు కూడా విరిగిపోయాయి. ఫ్యాన్లు తిరగక ఉక్కపోతతో నిరుద్యోగులకు లైబ్రరీ చెమటలు పట్టిస్తోంది. గ్రంథాలయానికి దాతలు పుస్తకాలు వితరణకు సుముఖంగా ఉన్నప్పటికీ వాటిని తీసుకుని భద్రపర్చేందుకు అనువైన స్థలం కూడా లేకపోవడం గమనార్హం.

గ్రంథాలయం ఒక్కటే దిక్కు..

మండలంలోని శాఖ గ్రంథాలయంలో మొత్తం 250 మంది సభ్యులు ఉన్నారు. డిగ్రీ, పీజీ విద్యనభ్యసించి వివిధ ఉద్యోగాల కోసం పోటీ పరీక్షలు రాసే నిరుద్యోగులు మండలంలో దాదాపు వెయ్యి మందికి పైగా ఉన్నారు. వీరందరికీ కేవలం మండల కేంద్రంలోని గ్రంథాలయం ఒక్కటే దిక్కు. ఇంత ప్రాధాన్యత ఉన్న గ్రంథాలయం అభివృద్ధికి నోచుకోవడం లేదు. మార్కెట్లో రకరకాల పుస్తకాలు అందుబాటులోకి వ స్తే.. గ్రంథాలయంలో పాత పుస్తకాలే దర్శనమిస్తున్నాయి. వ ర్షాకాలంలో పైకప్పు స్లాబు ఉరుస్తుండడంతో పుస్తకాలు తడిసి ముద్దవుతున్నాయి. ఫ్యాన్లు, బీరువా సైతం తడిచి చెడిపోతున్నాయి. దీంతో ఏ క్షణాన పైకప్పు ఊడి కిందపడిపోతుందోనని పాఠకులు భయంభయంగా చదువుకుంటున్నారు.

ప్రభుత్వ భవనంలోకి మార్చాలని డిమాండ్..

మండల కేంద్రంలో గతంలో ఐకేపీ కార్యాలయం నిర్వహించిన భవనం ప్రస్తుతం ఖాళీగా ఉంది. ఆ కార్యాలయాన్ని ఏడేళ్ల క్రితం నూతన భవనంలోకి మార్చారు. అప్పటి నుంచి పాత ఐకేపీ కార్యాలయ భవనం నిరుపయోగంగా మారింది. ఆ భవనాన్ని గ్రంథాలయం కోసం కేటాయించాలని కోరగా ఉన్నతాధికారుల ఆదేశాలతో ఇటీవల మండల అధికారులు పరిశీలించారు. ఆ భవనం కేటాయించొద్దని మహిళా సంఘా ల సభ్యుల ఆందోళనతో అధికారుల ప్రయత్నాలు ఆగిపోయాయి. ప్రస్తుతం పాత అటవీశాఖ, వ్యవసాయ కార్యాలయాల భవనాలు, ఇటీవల నిర్మించిన ఇందిరమ్మ మోడల్‌హౌస్ ఖాళీగా ఉన్నాయి. గ్రంథాలయానికి పక్కా భవనం నిర్మించే వరకు తాత్కాలికంగా నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భ వనాల్లోకి మార్చాలని పాఠకులు, నిరుద్యోగులు కోరుతున్నారు.

భవనం ఉరుస్తోంది

గ్రంథాలయ భవనం పైకప్పు స్లాబు వర్షానికి ఉరుస్తోంది. పుస్తకాలు, ఇతర వస్తువులు తడిసి పాడై పోతున్నాయి. గ్రంథాలయానికి ప్రత్యేక స్థలం లేక పక్కా భవనం మంజూరు కావడం లేదు. ఇటీవల ఐకేపీ పాత భవనం పరిశీలించాం. మహిళా సంఘాల సభ్యుల ఆందోళనతో ఆ ప్రయత్నం ఆగిపోయింది. వర్షాకాలంలో శిథిల భవనంలో లైబ్రరీ కొనసాగించడం ప్రమాదకరం. వేరే ప్రభుత్వ భవనంలోకి మార్చాలి.

– ప్రవీణ, లైబ్రేరియన్, కౌటాల


సొంత భవనం నిర్మించాలి



కౌటాల గ్రంథాలయానికి ప్రతీరోజు పాఠకులు, నిరుద్యోగులు వస్తుంటారు. పాలకుల, అధికారుల నిర్లక్ష్యంతో గ్రంథాలయానికి సొంత భవనం లేదు. ఒకే గదితో ఇరుకుగా ఉండి గాలి, వెలుతురు సక్రమంగా రావడం లేదు. సాయంత్రం చదువుకోవడం ఇబ్బందిగా ఉంది. డీఎస్సీ కోసం సిద్ధమవుతున్నా. అధికారులు సొంత భవనం నిర్మించాలి.

– ఎస్. మౌనిక, యాపలగూడ

కౌలు రైతులు బతికేదెలా..?



సుర్దాపూర్‌లో పొలం దున్నుతున్న కౌలు రైతు

- ఆదుకోని బ్యాంకులు, ప్రభుత్వాలు
- అధిక వడ్డీలతో దోచుకుంటున్న దళారులు

కెరమెరి: కౌలు రైతులు అనేక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రభుత్వాలు మారినా కౌలు రైతుల తలరాతలు మారడం లేదు. చట్టాలున్నా అమలుకు నోచుకోక అరిగోస పడుతున్నారు. బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి ససేమిరా అనడంతో దిక్కుతోచని స్థితిలో సాగు చేస్తున్నారు.

తప్పని కష్టం, నష్టం..

ఇతరుల భూములు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్న కౌలు రైతులు పలు కష్ట, నష్టాలకు గురవుతున్నారు. పంటల సాగుకు రుణ సౌకర్యం, ప్రకృతి వైపరీత్యాలకు పంట నష్టం జరిగితే పరిహారం వీరికి అందడం లేదు. భూయజమాని లేదా పట్టాదారుడి అనుమతితో పంటలు పండిస్తూ వారి హక్కులకు భంగం కలగకుండా చూస్తున్నారు కౌలు రైతులు. ప్రారంభంలో రుణ అర్హత కార్డులను కౌలు రైతులకు అందించే ప్రక్రియను రెవెన్యూ అధికారుల చేపట్టినా అది అర్ధంతరంగా నిలిచిపోయింది.

1100 మంది కౌలు రైతులు..

కెరమెరి మండలంలో మొత్తం 8412 మంది రైతులు ఉండగా వారిలో 1100 మంది కౌలు రైతులు ఉన్నట్లు అంచనా ఉంది. వీరికి మండలంలోని బ్యాంకర్లు రుణాలు ఇవ్వడానికి ససేమిరా అంటున్నారు. ఏటా నష్టపోతున్న కౌలు రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

దళారుల మాయ..

ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కౌలు రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం కావడంతో వారిలో నిరాశ అలుముకుంది. చేతిలో చిల్లి గవ్వలేక సాగు చేసేందుకు ముందుకొచ్చినా బ్యాంకర్లు రుణాలు ఇవ్వక పోవడంతో గత్యంతరం లేక వ్యాపారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో వ్యాపారులు, దళారులు మాయ చేసి అధికంగా వడ్డీలు వసూలు చేస్తూ కౌలు రైతులను నిలువునా దోచుకుంటున్నారని ఆరోపణలు విన్పిస్తున్నాయి.

నేడు పస్క పండుగ

దహెగాం: వర్షాకాలం ప్రారంభం, ఖరీఫ్ పనులు ముమ్మరంగా ప్రారంభమైన వేళ పల్లెల్లో పస్క పండుగ జరుపుకోవడం ఆనవాయితీ. మండల కేంద్రంలో ఆదివారం పస్క పండుగ జరుపుకోనున్నారు. ఈ సందర్భంగా శనివారం సాయంత్రం పాత దహెగాంలోని మైసమ్మ వద్ద మొక్కులు చెల్లించారు. గ్రామ పొలిమేరలో తెల్లని జెండా ఎగురవేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండాలని మొక్కులు చెల్లించనున్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌టౌన్: జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. శనివారం పట్టణంలోని పటేల్ గార్డెన్‌లో తెలంగాణ జర్నలిస్టు ఫెడరేషన్ జిల్లా ద్వితీయ మహాసభలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలను చైతన్యవంతులుగా చేసే బాధ్యత మీడియాపై ఉందన్నారు.

జిల్లా నూతన కార్యవర్గం

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా టి.సురేందర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా రాజశేఖర్, కోశాధికారిగా పుల్లూరి సంతోష్, ఉపాధ్యక్షులుగా విష్ణుగౌడ్, రవి, నాగేందర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా మహేశ్, జాతీయ కౌన్సిల్ సభ్యులుగా నీలి సతీశ్, సంయుక్త కార్యదర్శిగా వెంకన్న, లలిత్‌లను ఎన్నుకున్నట్లు సంఘం రాష్ట్ర కార్యదర్శి బసవ పున్నయ్య తెలిపారు.

తనిఖీ బృందానికి సహకారమందించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో అంజద్‌పాషా

కెరమెరి: ఉపాధిహామీ పథకం 13వ విడత సామాజిక తనిఖీ బృందానికి ఈజీఎస్ సిబ్బంది పూర్తి సహకారమందించాలని ఎంపీడీవో అంజద్‌పాషా అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి సిబ్బంది, తనిఖీ అధికారులకు నిర్వహించిన కోఆర్డినేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. జరిగిన పనులకు సంబంధించిన రికార్డులు పూర్తిస్థాయిలో అందించాలని, క్షేత్రస్థాయిలో అధికారులు వెళ్లినప్పుడు వారి వెంటే ఉంటూ అనుమానాలు నివృత్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, ఈసీ అక్యానాయక్, ఎస్ఆర్‌పీ రవియాదవ్, టీఏలు తదితరులు ఉన్నారు.

బదిలీపై వెళ్తున్న అధికారులకు సన్మానం



తిరుపతిని సన్మానిస్తున్న నాయకులు



దేవేందర్‌ను సన్మానిస్తున్న నాయకులు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా పర్సనల్ మేనేజర్‌గా పని చేసి ఆర్జీ 1 ఏరియాకు బదిలీపై వెళ్తున్న రెడ్డిమల్ల తిరుపతిని శనివారం గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో ఏరియా ఐఎస్‌టీయూసీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్, సెంట్రల్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ సంగెం ప్రకాశ్‌రావులు పర్సనల్ మేనేజర్‌ను శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. అధికారులు శ్రీనివాస్, ప్రశాంత్, యూనియన్ నాయకులు సదాశివ్, నారాయణ, గోలెం గట్టయ్య, రాజేశం, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో..

బెల్లంపల్లి ఏరియా నుంచి బదిలీపై వెళ్తున్న పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతిని ఏరియా టీబీజీకేఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఏరియా ఉపాధ్యక్షుడు మ(ల్రా)జు శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో నాయకులు పర్సనల్ మేనేజర్‌ను శాలువాతో సన్మానించి ఏరియాకు ఆయన చేసిన సేవలను గుర్తుచేశారు. కార్యక్రమంలో నాయకులు మంగీలాల్, సమ్మయ్య, దేవేందర్, చంద్రశేఖర్, మహేందర్‌రెడ్డి, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల ఆధ్వర్యంలో..

బదిలీపై వెళ్తున్న రెడ్డిమల్ల తిరుపతిని శనివారం బెల్లంపల్లి ఏరియా అధికారులు ఘనంగా సన్మానించారు. జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్‌హాల్‌లో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఏరియాలోని అన్ని విభాగాల అధిపతులు హాజరయ్యారు. ఏరియా ఇన్‌చార్జి జీఎం నరేందర్‌తో పాటు విభాగాల అధిపతులు పర్సనల్ మేనేజర్‌ను సన్మానించి మొక్క అందజేశారు. ఏరియా ఇంజినీర్ రామనాథం, డీజీఎంలు ఉజ్వల్‌కుమార్ బెహరా, కృష్ణమూర్తి, శ్రీనివాసరావు, మదీనా భాషా, ఫైనాన్స్ మేనేజర్ రవికుమార్ విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ నాయకుడికి సన్మానం..

బెల్లంపల్లి ఏరియా ఫారెస్ట్ డిపార్టుమెంట్‌లో విధులు నిర్వహిస్తూ శ్రీరాంపూర్ ఏరియాకు బదిలీపై వెళ్తున్న టీబీజీకేఎస్ ఏరియా ఆర్గనైజింగ్ కార్యదర్శి దేవేందర్‌ను శనివారం గోలేటి టౌన్‌షిప్‌లోని టీబీజీకేఎస్ కార్యాలయంలో సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మా(ల్రా)జు శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ సింగరేణి కార్మికుల హక్కుల సాధన కోసం టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన అనేక పోరాటాలు, ఆందోళన కార్యక్రమాల్లో దేవేందర్ చురుకుగా పనిచేశారన్నారు. సెంట్రల్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ మంగీలాల్, నాయకులు చంద్రశేఖర్, వెంకటేశం, ఏరియా కార్యదర్శి అలవేణి సంపత్, ఆఫీస్ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి, ఫిట్ కార్యదర్శులు రవీందర్, శ్రీనివాస్, గణపతి తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎం సెంటర్ లేక ఇక్కట్లు



లింగాపూర్‌లోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్

- ప్రైవేట్ వ్యక్తులను ఆశ్రయిస్తున్న వైనం
- 20వేలకు పైగా ఖాతాదారులు
- ఇబ్బందుల్లో సిర్పూర్(యూ), లింగాపూర్ ప్రజలు

లింగాపూర్: ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల్లో లబ్ధిదారులకు నేరుగా నగదు అందించకుండా పారదర్శకత కోసం వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోంది. రైతుభరోసా, రైతు రుణమాఫీ, పింఛన్లు, ఉపాధిహామీ వంటి తదితర పథకాల డబ్బులు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమవుతున్నాయి. కానీ నగదు విత్‌డ్రా చేసేందుకు సిర్పూర్(యూ), లింగాపూర్ మండలాల్లో ఒక్క ఏటీఎం సెంటర్ కూడా అందుబాటులో లేదు. దీంతో రైతులు, ఉద్యోగులు, వ్యాపారులు, సామాన్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బ్యాంక్ నుంచి నగదు తీసుకోవాలంటే నిత్యం ఖాతాదారులతో రద్దీగా ఉంటుంది. దీంతో నగదు కోసం రోజంతా వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంటుంది.

ప్రైవేట్ వ్యక్తులే దిక్కు..

లింగాపూర్ మండలంలో 14 గ్రామపంచాయతీలు, సిర్పూర్ (యూ)లో 16 గ్రామపంచాయతీలు ఉండగా 20వేలకు పైగా ఖాతాదారులు ఉన్నారు. ఈ రెండు మండలాల్లో ఇతర బ్యాంకు సేవలు, ఏటీఎంలు లేకపోవడంతో దాదాపు 40 కిలోమీటర్ల దూరంలోని ఉట్నూర్‌లో గల ఏటీఎం సెంటర్‌ను ఆశ్రయిస్తున్నారు. అంతదూరం వెళ్లలేని వారు కొందరు ప్రైవేట్ వ్యక్తులను నగదు విత్‌డ్రా కోసం ఆశ్రయిస్తున్నారు. వారు ఆధార్ బయోమెట్రిక్, వేలిముద్ర ఆధారంగా నగదు విత్‌డ్రా చేసి లబ్ధిదారులకు అందజేస్తున్నారు. ఇందుకు ఖాతాదారుల నుంచి పరిమితికి మించి కమీషన్ తీసుకుంటున్నారని ఆరోపణలు విన్పిస్తున్నాయి. సిర్పూర్(యూ), లింగాపూర్ మండలాల్లో అత్యధికంగా నిరక్షరాస్యులు, అమాయక గిరిజనులు ఉండడంతో మోసం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఖాతాదారులకు తెలియకుండా నిర్వాహకులు తమ ఖాతాల్లోకి నగదు బదిలీ చేసుకుంటున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆయా మండల కేంద్రాల్లో ఏటీఎం సెంటర్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఏర్పాటు చేయాలి



నగదు విత్‌డ్రా కోసం ఏటీఎం సెంటర్ లేక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నాం. సిర్పూర్(యూ), లింగాపూర్ మండల కేంద్రాల్లో వెంటనే ఏటీఎం సెంటర్లు ఏర్పాటు చేయాలి. అలాగే మరో బ్యాంకును కూడా ఏర్పాటు చేయాలి.

– జాటోత్ రాహుల్, లింగాపూర్

ఆసుపత్రి పరిసరాలు బురదమయం!



కాగజ్‌నగర్ సామాజిక ఆసుపత్రి సమీపంలో నిలిచిన నీరు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని ఎల్లగౌడ్‌తోటలో గల సామాజిక ఆసుపత్రి పరిసరాలు చిన్నపాటి వర్షం కురిస్తేనే అధ్వానంగా మారుతున్నాయి. గుంతల్లో నీరు చేరి పరిసరాలు బురదమయంగా మారుతున్నాయి. దీంతో రోగులు, సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

యూరియా కోసం తిప్పలు

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ సహకార సంఘం ఆధ్వర్యంలో పంపిణీ చేస్తున్న యూరియా కోసం పలువురు రైతులు శనివారం పడిగాపులు కాశారు. పట్టా పాసుపుస్తకాలు ఉంటేనే యూరియా పంపిణీ చేస్తుండడంతో కౌలు రైతులు ఆందోళనకు గురయ్యారు. ఏడీసీసీ బ్యాంకులో రుణాలు తీసుకున్న రైతులు ఒరిజినల్ పాసుబుక్కులు లేక ఇబ్బందులు పడ్డారు. ఏవో రామకృష్ణను సంప్రదించగా రెండు రోజుల నుంచి 200 మెట్రిక్ టన్నుల యూరియా అందజేశామని, కౌలు రైతులు యజమాని నుంచి కౌలు ధ్రువీకరణ పత్రం, బ్యాంకు లోన్ ఉన్నవారు బ్యాంకు నుంచి ధ్రువీకరణ పత్రం తీసుకురావాలని సూచించారు.

కాగజ్‌నగర్‌లో భారీ వర్షం

కాగజ్‌నగర్‌టౌన్/ కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంతో పాటు మండలంలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులు కూడా వీయడంతో కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.